
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024


అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో కమ్ముకున్న పొగ

మహా విషాదం

- 'అచ్యుతాపురం ఫార్మా సెజ్' ప్రమాదంలో జిల్లావాసులు ఇద్దరి మృతి
- పరిశ్రమ, ఆస్పత్రుల వద్ద కుటుంబ సభ్యుల రోదనలు
- స్వగ్రామాల్లో విషాద ఛాయలు

అంతటా విషాదమే. అటు పరిశ్రమ వద్ద.. ఇటు ఆస్పత్రుల్లోనూ.. మరోవైపు స్వగ్రామాల్లోనూ ఎక్కడ చూసినా ఆర్తనాదాలే. విశాఖపట్నం పరిధి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో బుధవారం జరిగిన పేలుడు ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో జిల్లాకు సంబంధించి ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో ముగ్గురు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు పరామర్శించి ఓదార్చారు. తాము అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.


పొందూరు : సీఎం చంద్రబాబు వద్ద విలపిస్తున్న ప్రశాంత్ తల్లి సత్యవతి

విధులకు వెళ్లిన.. కొద్దిసేపటికే..

- ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పొందూరు వాసి
- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు భరోసా

పొందూరు, ఆగస్టు 22: అప్పటివరకూ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపాడు. బుధవారం మధ్యాహ్నం భోజనం చేసి పరిశ్రమలో విధులకు హాజరయ్యాడు. పరిశ్రమకు చేరుకున్నానని.. విధులు పూర్తయిన తర్వాత త్వరగా వచ్చేస్తానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఆ కొద్దిసేపటికే అనుకోని ప్రమాదం సంభవించి.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. ఇదీ.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మాసెజ్‌లో పనిచేస్తున్న హంస ప్రశాంత్(36) విషాదాంతం.

- ప్రశాంత్ స్వగ్రామం పొందూరు. ఇక్కడ కనకలవీధి(జంగాల వీధి)లో తల్లిదండ్రులతో కలిసి నివసించేవాడు. అచ్యుతాపురంలోని ఫార్మాసెజ్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈయన భార్య జ్యోతి ఐవోబీలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దంపతులకు మూడేళ్ల కుమార్తె వానమికతోపాటు మరో నాలుగు నెలల చిన్నారి ఉంది. ఆ చిన్నారికి ఇంకా పేరు పెట్టలేదు. ప్రశాంత్ ఉద్యోగ రీత్యా కుటుంబంతో కలిసి విశాఖలో నివసిస్తున్నాడు. కొన్నేళ్ల కిందట తండ్రి మృతి చెందగా.. తల్లి సత్యవతిని కూడా తన వద్దకు తీసుకెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతూ.. సున్నిత మనస్కుడిగా అందరి దగ్గర మంచి పేరు పొందాడు. రోజు మాదిరి బుధవారం విధులకు వెళ్లిన ప్రశాంత్.. పరిశ్రమలో ప్రమాద ఘటనలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని రోదించారు. చిన్న కుమార్తెకు పేరు పెట్టకుండానే.. తమకు దూరమయ్యాడని తల్లి విలపించింది. స్వగ్రామంలో సొంతిల్లు నిర్మించుకుంటున్నాడని, అది పూర్తికాకుండానే తిరిగిరాని లోకాలకు తరలిపోయాడని వాపోయింది. పొందూరులో గురువారం సాయంత్రం ప్రశాంత్ అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులతోపాటు బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.


భార్య జ్యోతితో ప్రశాంత్ (ఫైల్)

అండగా ఉంటాం

అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంతి తల్లి సత్యవతి తన ఆవేదన వ్యక్తం చేసింది. ఒక్కగానొక్క కొడుకు మృతితో తాము పెద్ద దిక్కును కోల్పోయామని కంటతడి పెట్టగా.. చంద్రబాబు ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఉద్యోగంలో చేరిన నెలకే..

- మృతుల్లో వంజంగి గ్రామ యువకుడు

ఆమదాలవలస: అచ్యుతాపురంలోని ఫార్మా సెజ్ ఘటన మృతుల్లో ఆమదాలవలస మండలం వంజంగికి చెందిన పైడి రాజశేఖర్(23) ఉన్నాడు. ఉద్యోగంలో చేరిన నెల రోజులకే రాజశేఖర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగి పోయారు. పైడి ధర్మారావు, తులసమ్మ దంపతులకు రాజశేఖర్ ఒక్కడే కొడుకు. బీటెక్ పూర్తి చేసి.. ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. ఈ క్రమంలో గత నెల 15న అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. దీంతో తల్లిదండ్రులు ఎంతో ఆనందించారు. కాగా.. విధుల్లో చేరిన నెల రోజుల్లోనే అనుకోని ప్రమాదంలో తమ కుమారుడు మృతి చెందడంతో పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. చేతికి అందివచ్చిన కొడుకు.. అనంతలోకాలకు వెళ్లిపోయాడంటూ రోదించారు. మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు, గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి రాజశేఖర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా.. అంత్యక్రియలు నిర్వహించారు.


రాజశేఖర్ (ఫైల్)


ఆమదాలవలస : రాజశేఖర్ ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


లావేరు : చికిత్స పొందుతున్న రాంబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ లావేరు/ టెక్కలి, ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలోని పేలుడు ఘటనలో.. జిల్లావాసులు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. లావేరు మండలం సుభద్రాపురానికి చెందిన కోండ్రు రాంబాబు, సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన శ్రీనివాస్, జిల్లాకు చెందిన కె.నారాయణరావుకు గాయాలయ్యాయి. ఇందులో నారాయణరావు విశాఖ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


టెక్కలి: వడ్లపూడిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్

- లావేరు మండలం సుభద్రాపురానికి చెందిన కోండ్రు అక్కన్న, లక్ష్మీ దంపతుల పెద్ద కుమారుడు కోండ్రు రాంబాబు. ఈ దంపతులు కూలి చేస్తూ.. రాంబాబును బీఎస్సీ చదివించారు. అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో మూడేళ్ల కిందట రాంబాబు ఉద్యోగంలో చేరారు. తనకు వచ్చే జీతంతో తల్లిదండ్రులతోపాటు భార్య మానస, మూడేళ్ల కుమార్తెను పోషిస్తున్నారు. కాగా.. బుధవారం ఫార్మా కంపెనీలోని ప్రమాదంలో రాంబాబు గాయపడినట్టు సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు ఉలిక్కిపడ్డారు. వెంటనే అక్కడకు పయనమయ్యారు. ప్రస్తుతం విశాఖలోని ఆస్పత్రిలో రాంబాబు చికిత్స పొందుతున్నారు. కుమారుడికి మెరుగైన వైద్యం అందజేయాలని తల్లిదండ్రులు వేడుకున్నారు.
- ఆస్పత్రిలో క్షతగాత్రుడు రాంబాబును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, లావేరు మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, విజయనగరం పార్లమెంటరీ బీజేపీ ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనివాసరావు పరామర్శించారు. భయపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
- సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన పంగ శ్రీనివాస్ అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. శ్రీనివాస్‌కు ముఖం, చేతులు కాలిపోవడంతో వడ్లపూడిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు పాపయ్య, అప్పన్నమ్మ వ్యవసాయదారులు. శ్రీనివాస్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన ఉద్యోగరీత్యా వడ్లపూడిలో నివాసముంటున్నారు. గురువారం తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు వడ్లపూడిలో ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్‌ను పరామర్శించారు.

అచ్యుతాపురం ఘటన నేపథ్యంలో.. జిల్లాలోని పరిశ్రమల్లో కార్మికుల భద్రత చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమల్లో యాజమాన్యాలు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో.. కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావుడి తప్ప.. అధికారులు కనీసస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు సంభవించి.. ప్రాణనష్టం వాటిల్లుతోందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా పరిశ్రమల్లో పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదాలెన్నో..

- 2011 నవంబరు 28న పైడిభీమవరం అరబిందో పరిశ్రమలో రసాయన మిశ్రమాలు కలుపుతుండగా.. రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులు చనిపోయారు.
- ఎచ్చెర్ల మండలం చిలకపాలెం నాగార్జున అగ్రికం పరిశ్రమలో 2012లో రియాక్టర్ పేలింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. అప్పట్లో చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో గ్రామాలను ఖాళీ చేయించే ప్రయత్నం చేశారు. కానీ ఇంతలో రియాక్టర్లు అదుపులోకి రావడంతో ఊపిరిపీల్చుకున్నారు.
- 2016 ఆగస్టు 11న పైడిభీమవరంలోని ఓ పరిశ్రమలో రియాక్టర్ నుంచి మంటలు చెలరేగి ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. ఆ తర్వాత మూడురోజుల్లోనే పరిశ్రమలో వాల్వ్ తిప్పుతుండగా పేలుడు సంభవించి ఒకరు మృతిచెందారు. అదే ఏడాది డిసెంబరు 2న రెడ్డీస్ ల్యాబ్‌లో బ్రాయిలర్ పేలి ఒక ఉద్యోగి మరణించారు.
- 2019లో పైడిభీమవరంలోని అరబిందో పరిశ్రమలో ఓ కార్మికుడిపై రసాయనాలు పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే ఏడాది ఆగస్టు 11న అరబిందో పరిశ్రమ పవర్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు మృతిచెందారు. ఆగస్టు 18న రియాక్టర్ శుభ్రం చేస్తుండగా వేడినీరు పడి మరొకరికి గాయాలయ్యాయి.
- 2023 నవంబరు 19న పైడిభీమవరంలోని ఎపిటోరియా పరిశ్రమలో విద్యుత్ షాక్‌కు గురై ఒక కార్మికుడు మృత్యువాత పడ్డాడు.
- ఈ ఏడాది జూన్ 24న పైడిభీమవరం సమీపంలో ఓ పరిశ్రమలో డ్రమ్ములు తరలిస్తుండడగా పేలుడు సంభవించింది. ఇద్దరు కార్మికులు గాయపడ్డారు.
- జూన్ 30న పైడిభీమవరంలోని సరకా పరిశ్రమలో అగ్నిప్రమాదం సంభవించింది. ఒక బ్లాక్ పూర్తిగా కాలిపోయింది. సమయానికి అక్కడ నుంచి అందరూ వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది.
- జూలై 26న పైడిభీమవరం పారిశ్రామిక వాడలో షెడ్డుపై నీరుకారుతోందని పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇద్దరు కార్మికులు పని చేస్తుండగా జారిపడి మృతిచెందారు.

పరిశ్రమల్లో భద్రత ఏదీ?

- యాజమాన్యాల నిర్లక్ష్యం
- కానరాని రక్షణ చర్యలు
- తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న కార్మికులు

(రణస్థలం/ ఎచ్చెర్ల)

పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలకు గురై కొంతమంది కార్మికులు మృత్యువాత పడుతున్నారు. మరికొంతమంది గాయాల పాలవుతున్నారు. తాజాగా విశాఖపట్నం పరిధి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో ప్రమాదం సంభవించింది. దీంతో మన జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతపై చర్చ జరుగుతోంది. జిల్లాలో 415 వరకూ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో భారీ, మధ్యతరహా పరిశ్రమలు 15 వరకూ ఉన్నాయి. చిన్న పరిశ్రమలు 300 వరకూ ఉన్నాయి. గ్రానైట్ పరిశ్రమలు వందకుపైగా ఉన్నాయి. వీటిలో 80 వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్టు గణంకాలు చెబుతున్నాయి. పరిశ్రమల్లో స్థానికులతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్‌కు చెందిన వారు ఒప్పంద కార్మికులుగా చేరుతున్నారు. పైడిభీమవరం పారిశ్రామికవాడలో దాదాపు 30 వరకూ పరిశ్రమలున్నాయి. ఇక్కడ ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. పరిశ్రమల్లో యాజమాన్యాలు కనీస భద్రతా చర్యలు చేపట్టక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా సరైన వైద్య సదుపాయాలు కూడా లేవు. పైడిభీమవరంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఉంది. 2010లో కార్మికుల సౌకర్యార్థం ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేశారు. కానీ వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించలేదు. పరిశ్రమలో ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులకు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం, విజయనగరం తరలిస్తున్నారు. సకాలంలో వైద్యం అందక మార్గమధ్యలో కొంతమంది కార్మికులు మృత్యువాత పడుతున్నారు.


చిలకపాలెం నాగార్జున అగ్రికెమ్‌లో జరిగిన ప్రమాదం(ఫైల్)

కార్మికశాఖ ప్రేక్షక పాత్ర

జిల్లాలో కార్మిక శాఖ ప్రేక్షక పాత్రకే పరిమితమవుతోంది. పరిశ్రమలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. కార్మిక చట్టాలను అమలుచేయకపోయినా చర్యలు తీసుకోవడం లేదు. కనీసం పరిశ్రమల్లో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయో తనిఖీలు చేయకపోవడం దారుణం. పరిశ్రమ భద్రతా అధికారులు దృష్టి సారించాలి.

-పి.తేజేశ్వరరావు, కార్మిక సంఘం నాయకుడు

తనిఖీల ఊసేలేదు

వాస్తవానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి పరిశ్రమలను ఇన్‌స్పెక్టరీ ఆఫ్ ఫ్యాక్టరీస్, భూగర్భ గనుల శాఖ, కార్మిక శాఖ అధికారులు తనిఖీ చేయాలి. కానీ ఈ అధికారులు ఎక్కడుంటారో తెలియని పరిస్థితి. కనీసం కార్యాలయాల చిరునామా సైతం తెలియని దుస్థితి నెలకొంది. జిల్లాల విభజన జరిగినా.. ఈ కార్యాలయాలు మాత్రం ఉమ్మడిగానే కొనసాగుతున్నాయి. తనిఖీలపై ప్రశ్నిస్తే శాఖల్లో సిబ్బంది కొరత సాకుగా చూపుతుంటారు. దీంతో పరిశ్రమల నిర్వహణలో యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శించడం, భద్రతాచర్యలు పాటించకపోవడం, కార్మిక చట్టాలను అమలుచేయకపోవడం వంటివాటితో కార్మికులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది. పరిశ్రమలు కార్మికులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

భద్రతపై విచారణ

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

జిల్లాలో పరిశ్రమల భద్రతపై విచారణ చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. 'అచ్యుతాపురం ఘటన నేపథ్యంలో జిల్లాలో కూడా పరిశ్రమల స్థితిగతులు.. వాటి భద్రతపై విచారణ చేస్తున్నాం. మొత్తం పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి.. వాటిలో కార్మికులకు భద్రతాపరంగా తీసుకున్న చర్యలేంటి... ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలు.. తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించా. పదిరోజుల్లో నివేదిక అందుతుంది. నివేదిక లభించగానే వివరాలు వెల్లడిస్తాం. అచ్యుతాపురం ఘటనలో జిల్లాకు చెందిన మృతులు.. క్షతగాత్రులకు ప్రభుత్వం నుంచి పరిహారం లభిస్తుంది' అని కలెక్టర్ తెలిపారు.



మూడు నెలలుగా.. జీతాల్లేవ్

- కాంట్రాక్ట్ లెక్చరర్స్‌కు వేతన కష్టాలు
- రెన్యువల్స్ కోసం ఎదురుచూపు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(ఇచ్ఛాపురం)

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్స్ మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రెన్యువల్ కోసం ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యల పరిష్కారంపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఏటా అకడమిక్ ఇయర్ ప్రారంభానికి ముందే మే నెలలో ఇంటర్మీడియట్ బోర్డు కాంట్రాక్ట్ అధ్యాపకులకు రెన్యువల్(యథావిధిగా కొనసాగింపు) ఉత్తర్వులు జారీచేసేది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా.. ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. వార్షిక పరీక్షల్లో ప్రతీ సబ్జెక్ట్‌లోనూ జిల్లా ఉత్తీర్ణత శాతంలో విద్యార్థులు పాస్ కావాలనే ప్రభుత్వం షరతు విధించింది. ఈ నిబంధన ప్రకారం ఆయా సబ్జెక్టుల్లో బోధిస్తున్న అధ్యాపకులు కొనసాగింపునకు అర్హత సాధిస్తారు. జిల్లా ఉత్తీర్ణత శాతం కంటే ఆ సబ్జెక్ట్‌లో తక్కువ మార్కులు వస్తే రెన్యువల్‌కు అనర్హులు అవుతారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 350 మంది కాంట్రాక్ట్ లెక్చరర్స్ పని చేస్తున్నారు. వీరికి గత మూడు నెలలుగా జీతాలు అందక పోవడంతో.. కుటుంబ పోషణ భారమవుతోందని ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల రెన్యువల్ లేక, ఇటు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తమను రెగ్యులర్ చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా స్పందించి రెన్యువల్ చేయాలని, పెండింగ్ వేతనాలు అందజేయాలని కోరుతున్నారు.

ఆదుకోవాలి

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసి ఆదుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని జీవో జారీ చేసింది. కానీ, అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ చేయాలి. పెండింగ్ జీతాలు అందజేయాలి.

- నరసింగరావు, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జిల్లా అధ్యక్షుడు

ఇబ్బందులు పడుతున్నాం


మూడు నెలలుగా జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. రెన్యువల్ చేయకపోయినా.. జీతాలు ఇవ్వకపోయినా.. మా బాధ్యతగా విద్యార్థులకు బోధన చేస్తున్నాం. మా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

- సురేష్, ఫిజిక్స్ లెక్చరర్, ఇచ్ఛాపురం

ఉచిత ఇసుకపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబర్లు

- వాహనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయనున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ఇసుక విధానాల్లో ఏ సమస్యలు ఎదురైనా.. అక్రమాలు జరిగినా ప్రజలు నేరుగా టోల్ ఫ్రీ **1800 425 6012**కు, వాట్సాప్ నెంబర్ **9701691657**కు ఫిర్యాదు చేయవచ్చు. 24 గంటలూ ఈ నంబర్లు పనిచేస్తాయి. ఇసుకను తరలించే వాహనాలకు ఆర్టీఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కొత్తూరు మండలం అంగూరు వద్ద స్టాక్ యార్డు ఏర్పాటు చేశాం. అక్కడకి వచ్చే ట్రక్కులలోకి ఇసుకను లోడ్ చేయబోయే తేదీ, సమయాన్ని స్పష్టంగా పేర్కొంటూ బుకింగ్ రశీదును జారీ చేస్తాం. ప్రతి కేటగిరీ వాహనంపై కిలోమీటరుకు, మెట్రిక్ టన్నుకు రవాణా చార్జీలను ఖరారు చేశాం. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి ఉచితం. స్టాక్‌యార్డుల వద్ద రెవెన్యూ, పోలీస్, పంచాయతీలలో కూడిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు పాయింట్లు ఏర్పాటు చేశాం. అంగూరు, సోమరాజపురంలో సచివాలయంలో బుకింగ్ కేంద్రం సిద్ధం చేశాం. ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. ఉదయం ఆరు నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తరలింపునకు అనుమతి ఉంటుంది. రాత్రి వేళల్లో రవాణా నిషేధం. లోడింగ్, ఇతర ఖర్చులతో టన్ను ఇసుక ధర రూ.340గా నిర్ధారించాం. పది మెట్రిక్ టన్నులకు పది కిలోమీటర్ల పరిధిలో రూ.1633గా రవాణా చార్జీలను నిర్ణయించాం. 15 కిలోమీటర్ల పరిధికి రూ.2035, ఇరవై కిలోమీటర్ల పరిధికి రూ.2438, ముప్పై ఐదు కిలోమీటర్ల పరిధికి రూ.3668 చొప్పున ధరను నిర్ధారించాం. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు ఇసుక తరలిపోకుండా పైడిభీమవరంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామ'ని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, మైన్స్ డీడీ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ మహేశ్వరరెడ్డి

'ఎత్తిపోతల' మరమ్మతులకు నిధులు విడుదల

- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, ఆగస్టు 22: ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.79 లక్షల నిధులు గురువారం విడుదల చేసిందని వ్యవసాయ, పశుసంవర్థకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 'గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో జిల్లాలో ఎత్తిపోతల పథకాలు పాడైపోయాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల లోపల రాగివైరు, డీపీ ఆయిల్ చోరీకి గురైంది. ఫలితంగా ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా ఎన్డీయే కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో మరమ్మతులు చేపట్టి.. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామ'ని మంత్రి అచ్చెన్న వెల్లడించారు. దీనిపై టీడీపీ నేతలు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, రైతులు హర్షం వ్యక్తం చేశారు.



బర్త్‌డే సర్‌ప్రైజ్!

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'విశ్వంభర' చిత్రంలోని ఆయన లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఒక రాతిపై కూర్చుని ప్రత్యేక శక్తులు కలిగిన త్రిశూలాన్ని పట్టుకుని ఉన్న మెగాస్టార్ పవర్‌ఫుల్‌గా అనిపించారు. ఆయన పుట్టినరోజున టీజర్ విడుదల ఉండదని దర్శకుడు వశిష్ట ముందే స్పష్టం చేయడంతో కొంత నిరాశ చెందిన మెగా అభిమానులను ఈ లుక్ సర్‌ప్రైజ్ చేసింది. 'చీకటి, చెడు ఈ ప్రపంచాన్ని ఆక్రమించినప్పుడు ఒక అద్భుతమైన తార పోరాడడానికి ప్రకాశిస్తుంది' అని చిత్రం టీమ్ ఈ పోస్టర్‌లో పేర్కొంది. 'విశ్వంభర' చిత్రం కోసం ఓ ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు. అద్భుతమైన డ్రామా, ఎమోషన్స్‌తో ఈ సినిమా విజువల్ వండర్‌గా ఉంటుందని నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ చెప్పారు. అలాగే పుట్టినరోజు సందర్భంగా తండ్రితో దిగిన ప్రత్యేక ఫొటోను రామ్‌చరణ్ విడుదల చేశారు.

నచ్చితే ఎక్కడికైనా వెళతా..

"మనకు నచ్చిన వారి కోసం మనం తప్పకుండా నిలబడాలి. నాకు నచ్చినవారి కోసం ఎక్కడికైనా.. ఎంతదూరమైనా వెళతా.. ఏమైనా చేస్తా. ఈ మూవీ ఫంక్షన్ కోసం తబిత సుకుమార్ నన్ను పిలిచారు. అందుకే 'పుష్ప 2' క్లైమాక్స్ షూటింగ్‌లో ఉండి కూడా.. ఇక్కడికి వచ్చాను. 'మారుతీనగర్ సుబ్రమణ్యం' లాంటి సినిమాలు హిట్టవ్వాలి. ఇలాంటి మంచి కథలు ఉన్న చిత్రాలు మరిన్ని రావాలి అని కోరుకుంటున్నాను" అని అల్లు అర్జున్ అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రావురమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సుకుమార్ చిత్రాన్ని సమర్పించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లు అర్జున్, సుకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాను చూశాను. చాలా బాగుంది" అని చెప్పారు. "సినిమా అనుకున్నదానికంటే బాగా వచ్చింది. ఇది టీమ్ ఎఫర్ట్" అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు.





హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ ఒకటయ్యారు. కర్ణాటకలోని కూర్గ్‌లో బంధు మిత్రుల సమక్షంలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరిగింది. వీరిద్దరికీ తొలి చిత్రం అయిన 'రాజావారు రాణీగారు'లో నటించే సమయంలో ప్రేమలో పడ్డారు. మార్చి 13న వీరి నిశ్చితార్థం జరిగింది.

ఐటమ్ సాంగ్ చేస్తుందా?



నటి శోభితా ధూళిపాళకు ఇటీవలే నాగచైతన్యతో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అమ్మడును ఓ క్రేజీ ఆఫర్ వచ్చి తలుపు తట్టింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్, కియారా అడ్వానీ జంటగా తెరకెక్కనున్న 'డాన్ 3'లో ఓ ప్రత్యేక గీతంలో నటించడానికి శోభితను మేకర్స్ సంప్రదించారట. దానికి శోభిత సమ్మతించారని కొందరు, అదేంకాదు ఇంకా చర్చల్లోనే ఉందని మరికొందరు అంటున్నారు. మరి శోభిత నిజంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా.. లేదా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఆమె నిర్ణయం కోసం ఆ చిత్ర దర్శక నిర్మాతలే కాదు, అక్కినేని అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్త ఇంట్లో నరేశ్



సీనియర్ నటుడు నరేశ్ ఓ ఇంటి వాడయ్యారు. చిలుకూరి బాలాజీ ఆలయానికి సమీపంలో ఆయనకు ఓ వ్యవసాయ క్షేత్రం ఉంది. అందులో ఓ పెద్ద ఇల్లుని అత్యాధునిక వసతులతో నిర్మించి ఇటీవలే గృహ ప్రవేశం చేశారు. ఈ భవంతికి విజయకృష్ణ మందిరం అని పేరు పెట్టారు. ఇక్కడే హీరో కృష్ణ, ఇందిరా దేవి విగ్రహాలతో ఏర్పాటు చేసిన ఇందిరా దేవి స్ఫూర్తి వనాన్ని కూడా ఆ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన చిత్ర ప్రముఖులకు నరేశ్, పవిత్ర స్వాగతం పలికారు. నరేశ్ కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇన్ ప్రోగ్రెస్

చిన్నా ఇది వింత లోకం!



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ కీలక పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ సినిమా తీస్తున్నారు. నందకిశోర్ ఈమని దర్శకుడు. ఈ చిత్రం నుంచి భరద్వాజ్ గాలి రాసిన 'చిన్నా.. ఇది వింత లోకం' పాటను విడుదల చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

గరుడ పురాణం ఏం చెబుతోంది?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా నటిస్తున్న తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కే.ఎస్.నందీశ్ దర్శకత్వంలో విజయ్‌లోహిత్ నిర్మిస్తున్నారు. ఇటీవలే సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నందీశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఇదో వైవిధ్యభరితమైన సినిమా" అని అన్నారు. "మంచి కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా అందరికీ మంచి ఫీల్ గుడ్ మూవీ చూశామనే అనుభూతిని ఇస్తుంది" అని నిర్మాత విజయ్‌లోహిత్ చెప్పారు.

బయట ప్రపంచం చాలా చెత్తగా ఉంది



'ఏ మహిళ అయినా ఎవరితోనూ తన ఇబ్బందిని చెప్పుకొనే ధైర్యం చేయలేదని అనిపిస్తేనే ఆమెను మరింత ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారికి నో చెప్పడం నేర్చుకోవాలి' అన్నారు మంచు లక్ష్మి. చిత్ర పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులను వెంటాడి వేధిస్తున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'అన్యాయం జరిగిన వెంటనే బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉంది. అలాగే ఆర్టిస్టులు తెలివిగా నో చెప్పడం నేర్చుకోవాలి. కెరీర్ మొదలు పెట్టిన సమయంలో నన్నూ కొందరు ఇబ్బంది పెట్టారు. వారిపై గట్టిగా అరిచి నాకు వచ్చిన ఛాన్స్ పోగొట్టుకున్నా. కానీ తర్వాత అలాంటి విషయాల్లో తెలివిగా వ్యవహరించడం నేర్చుకున్నా. అప్పటికీ అవతలి వారు విసిగిస్తుంటే మనం వారికి బుద్ధి చెప్పక తప్పదు. ఎందుకంటే బయటి ప్రపంచం చాలా చెత్తగా ఉంది' అన్నారామె.

FARNAZ

వేతనాలు లేక.. పూటగడవక

● 12 వారాలుగా అందని వైనం ● ఇదీ జిల్లాలో ఉపాధి వేతనదారుల పరిస్థితి

ఇచ్ఛాపురం: జిల్లాలోని వేతనదారులకు 12 వారాలుగా వేతనాలు అందకపోవడంతో పూటగడవని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు రెండు కోట్ల వరకూ బకాయిలు చెల్లించాల్సిఉంది. జిల్లాలో 3.5లక్షల జాబ్‌కార్డుదారులు ఉండగా ఇందులో సుమారుగా రెండు లక్షల మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. వీరిలో రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. వీరికి ఉపాధి పనులు చేపట్టగా వచ్చి కూలీ డబ్బులే జీవనాధారం. అయితే ఉపాధి పనులు చేసి 12 వారాలు గడిచినా నేటికీ ఒక్క రూపాయి కూలీ డబ్బులు కూడా చెల్లించలేదు. వేతనాలు లేక ఇంట్లో నిత్యావసర సరుకులు కూడా కొనుగోలు చేసుకోలేని దుస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తినా వైద్యం చేయించుకోవడానికి చేతిలో చిల్లి గవ్వ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి 15 రోజులకోసారి కూలీలకు వేతనం చెల్లింపులె జరిగేవి.దీంతో వేతనదారులు ఉత్సాహంగా పనుల్లో పాల్గొనేవారు. ఈఏడాది జూన్ వరకు పనులు సాగించారు. ఆ తర్వాత పనులు నిలిపివేశారు. అప్పటికి ఒక్కొక్కరికి ఆరువారాలు వరకు పనులకు సంబంధించిన బకాయిలు చెల్లించాల్సిఉంది. గతంలో పనులు నిలిపివేసిన తర్వాత ఒకటిరెండు వారాల్లో బిల్లులుచెల్లించేవారని కూలీలు చెబుతున్నారు. ప్రస్తుతం పనులు నిలిపివేసి రెండు నెలలు దాటుతున్నా బిల్లులు అందని పరిస్థితి నెలకొంది. ఒక్కో కూలీకి రూ.ఎనిమిది వేల వరకూ చెల్లించాల్సి ఉంది.ఈవిషయంపై ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వడంలేదని వాపోతున్నారు. జిల్లాలో సుమారుగా రెండు లక్షలు మంది వరకు జాబ్‌కార్డుదారులకు వేతనాల చెల్లింపులు నిలిచి పోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.



బూర్జపాడులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

నిధులు వచ్చిన వెంటనే చెల్లిస్తాం..

జిల్లాలో ఉపాధి పనులకు సంబంధించి కూలీల వేతనాలు బకాయిల విషయం ఇప్పటికే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేంద్రప్రభుత్వం నిధులు విడు దలయ్యే అవకాశముందని చెప్పారు.నిధులు వచ్చిన వెంటనే మొత్తం వేతనదారుల బకాయిలు చెల్లిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల వరకు ఉపాధి కూలీలు పనులు చేశారని, వారందరికీ బిల్లులు త్వరలో చెల్లిస్తామని చెప్పారు.

25న గ్రూప్-2 మెయిన్స్ మాక్ టెస్ట్

టెక్కలి:ఎర్రన్న విద్యాసంకల్పంకార్యక్రమంలో భాగంగా ఈనెల 25న గ్రూప్-2 మెయిన్స్ మాక్‌టెస్ట్ నిర్వహించనునన్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీకాకుళంలోని విద్యాదరి కళాశాల, టెక్కలిలోని విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల, పలాసలోని మదర్‌థెరీసా పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పర్యవేక్షణలో ఎర్రన్న విద్యాసంకల్పం గ్రూప్-2 మెయిన్స్ మాక్‌టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎండల మల్లన్నకు పూజలు

టెక్కలి: రావివలస ఎండలమల్లికార్జునస్వామిని గురువారం జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వీరిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉర్లాంలో పొలంబడి

నరసన్నపేట: వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయశాఖ ఏడీఏ రవీంద్రభారతి సూచించారు. గురువారం ఉర్లాంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో సునీత మాట్లాడుతూ యూరియా తక్కువ మోతాదులో చల్లాలన్నారు.

సండెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

నందిగాం: ఆకులరఘునాధపురంలో నిర్మించిన సండెమ్మతల్లి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.గ్రామానికి చెందిన పెద్దింటి కృష్ణారావు దంపతులు,గ్రామస్థుల ఆధ్వర్యంలో పురోహితులు మావడి శ్రీనివాస్ శర్మ, సింహాచలం శర్మ పర్యవేక్షణలో పూజలు నిర్వహించి మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య ప్రతిష్ఠ జరిగింది.టీడీపీ నాయకులు కింజరాపు హరివరప్ర సాద్, పోలాకి చంద్రశేఖర్, మళ్ల బాలకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వర రావు, తర్ర రామకృష్ణ, ఉమాపతి తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బడగాంలో మాజీసర్పంచ్ కూన వాసునాయుడు ఆధ్వ ర్యంలో ఏర్పాటుచేసిన అభయాంజనేయ విగ్రహాన్ని గురువారం ప్రతి ష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూన శాంతారావు, నాయకులు మల్లేశ్వరరావు, జయంతిరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

108 సేవలపై అవగాహన

నందిగాం: నందిగాం పీహెచ్‌సీలో గురువారం 108 సేవలపై అవగాహన కల్పించారు.వైద్యాధికారి కె.అనితకుమారి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యక ర్తలకు 108 వాహనం ద్వారా గర్భిణులు, నవజాత శిశువులకు సకాలంలో అం దించనున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దాతారాం, ఈఎన్‌టీ బి.రాము, పైలెట్ ఎస్.చిరంజీవులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

పలాస: హాస్టళ్ల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పలాసలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు పెరుగుదల దృష్ట్యా ప్రభుత్వం మెస్‌చార్జీలను పెంచడం లేదన్నారు. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు.సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు అర్జున్, సందీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు

మందస: మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల 2024-25 సంవత్సరానికి అతిథి అధ్యాపకుని కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బడే తేజేశ్వ రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృత్తి విద్యా ఆఫీసు అసిస్టెంట్‌షిప్ కోర్సులో టైపు, షార్ట్‌హ్యాండ్ పోస్టు ఖాళీ ఉందని తెలిపారు.పోస్టు గ్రాడ్యుయేట్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు శుక్రవారంలోగా పూర్తి వివరాలను కళాశాలకు అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగాం: కొత్తగ్రహారం 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు, నందిగాం ఏఈ వెంకటరమణలు ఒక ప్రకటనలో తెలిపారు. దేవుపురం, పెద్దబాణాపురం గ్రామాల పరిధిలో జంగిల్ క్లియరెన్స్, లైన్ నిర్వహణ దృష్ట్యా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దేవుపురం, కొత్తగ్రహారం, తురకలకోట, బడగాం, పెద్దబాణాపురం, జడ్యాడ తదితర గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

●టెక్కలి: నర్సింగపల్లి, గూడేం, ముఖలింగాపురం పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు 11కేవీ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతులను నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

●వజ్రపుకొత్తూరు:మండలంలోని 33కేవీ సబ్‌స్టేషన్ అక్కుపల్లి ఫీడర్ పరిధిలో శుక్రవారం చెట్టుకొమ్మలు తొలగించనుండడంతో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు అక్కుపల్లి, బైపల్లి, బాతుపురం, మోట్టూరు, గరుడుభద్ర, రాజాం పరసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

● పలాస రూరల్: బొడ్డపాడు, మాకన్నపల్లి 33/11 కేవీ ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నట్లు ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శుక్రవారం మాకన్నపల్లి, చినసీలావతి, పెదసీలావతి, కొత్తూరు, గురుదాసుపురం, మామిడిమెట్టు, రంగోయిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

●జలుమూరు (సారవకోట): సారవకోట విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో గల లంబ ఫీడర్‌లోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టుకొమ్మలు తొలగించి మరమ్మతులు చేపడుతుండడంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు మాళువ, సవర మాళువ, మాళువకాలనీ, దాసుపురం, పనసలోవ, బొంతు, సవరబొంతు, బొంతుకూడలి, చిన్నకిట్టాలపాడు, కురిడింగి, మహసింగి, కొత్తపేట, గొల్లపేట, గాతలపేట, నారాయణపురం, పెదలంబలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు నరసన్నపేటలో జాబ్ మేళా

నరసన్నపేట:నరసన్నపేట జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల ఆవరణలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశాల మేరకు శనివారం ఇంటర్ ఉత్తీర్ణత పొందిన నాన్‌ఎంపీసీ గ్రూపు విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఆర్‌ఐవో దుర్గారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ అర్హతతో ఐటీ పరిశ్రమల్లో చేరేందుకు 75 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు.

26న అన్నక్యాంటీన్ల పునఃప్రారంభం

కోటబొమ్మాళి: టెక్కలి ఇందిరాగాంధీ జంక్షన్, కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో అన్నక్యాంటీన్లు ఈనెల 26 నుంచి పునఃప్రారంభించనున్నట్లు అన్న క్యాంటీన్ నిర్వాహకులు లాడి శ్రీనివాస్ తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ డోకి మోహనరావు రూ.10వేలను అన్నక్యాంటీన్ నిర్వహణకు అందజేశారు.

సామాజిక విమర్శకుడు డాక్టర్ ముత్యం

పలాస: డాక్టర్ ముత్యం సామాజిక విమర్శకుడని, ఆయన రచనలు ఆలోచింపజేసే విధంగా ఉంటాయని, శ్రీకాకుళం ఉద్యమంపై రాసిన రచనలు మరువలేనివని పలాస డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం పలాస డిగ్రీ కళాశాలలో జనజాగృతి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ముత్యం సంతాపసభను నిర్వహించారు.

కౌలు రైతుల భూముల పరిశీలన



సన్యాసిపేటలో భూముల రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

టెక్కలి: లింగాలవలస పంచాయతీ సన్యాసిపేట పరిధి గిరిజన కౌలురైతులు సాగుచేస్తున్న భూములను గురువారం కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్, జేసీ ఫార్మద్ అహ్మద్ ఖాన్‌లు పరిశీలించారు. ఆ గ్రామ పరిధిలో బంగారం బండి సంజీవరావు కుమారులకు సంబంధించిన 22ఎకరాల 85సెంట్ల భూమిని సన్యాసిపేటకు చెందిన 30 మంది గిరిజన రైతులు కౌలు చేస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కౌలు రైతులు తంప రంగారావు, చింతాడ కొండయ్య, చింతల బాలరాజు, నానుపురం చిన్నారావు తదితరులతో మాట్లాడారు. ల్యాండ్‌పర్చేజ్ స్కీమ్ కింద కొనుగోలు చేసి కౌలు చేస్తున్న గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో బొమ్మాళి సుదర్శన్‌దొర, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఢిల్లీలో సమావేశం

సన్యాసిపేటలో సర్వేనెం.1-1, 1-34 ప్రాంతాల్లోగల 22 ఎకరాల 85సెంట్ల జిరాయితీ సాగుచేస్తున్న కౌలురైతులు చింతల బాలరాజు, నానుపురం చిన్నారావు నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్‌కు అర్జీ పెట్టుకున్నారు.ఈ మేరకు శుక్రవారం న్యూఢిల్లీలో ఎన్‌సీఎస్టీ సభ్యుడు జోద్ హుస్సేన్ సమక్షంలో సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా ఎన్‌సీఎస్టీ రీసెర్చ్ ఆఫీసర్ హెచ్‌ఆర్ మీరా ఉత్తర్వులు విడుదలచేశారు. ఈ మేరకు సంబంధిత గిరిజన రైతులు, గిరిజన సంఘ నాయకుల వాబ యోగి తదితరులు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు.

జ్వర పీడితులను గుర్తించండి

ఎల్.ఎన్.పేట: ప్రతిరోజూ ఇంటింటికివెళ్లి జ్వరపీడితులను గుర్తించి వసరమైన మందులను పంపిణీ చేయాలని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు వైద్య సిబ్బందికి సూచించారు.మండలంలోని బోరమాంబపురంలో ఇటీవల డెంగ్యూ జ్వరంపై శ్రీకాకుళం సర్వజనఆస్పత్రినుంచి తురకపేట పీహెచ్‌సీకి సమాచారం రావడంతోగురువారం వైద్యాధికారి ఎ.లక్ష్మీదీప్, వైద్యసిబ్బందితో ఆయన గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో డెంగ్యూ బాధితుని ఇంటికి వెళ్లి పరిశీలించారు. గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీలు పరిశుభ్రం చేయించి బ్లీచింగ్ వేయించారు. సంయుక్తంగా పారిశుధ్యపనులు చేపట్టాలని ఈవోఆర్డీ ఐ.పద్మజ కార్యదర్శి విష్ణుకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో ప్రీ లోక్ అదాలత్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కోర్టులో గురువారం ప్రీ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా మండల న్యాయసేవా సంఘం అధ్యక్షురాలు, జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత మాట్లాడుతూ సెప్టెంబరు 14నజాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.తిరుపతి, లఖినేని శ్రీనివాసులు, పంచి రెడ్డి అర్జునరావు, వెలమల అప్పలనాయుడు, కె.మన్మధరావు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి

కోటబొమ్మాళి: ఓటరుజాబితా సవరణకు అన్ని రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ వి.అప్పలరాజు కోరారు. గురువారం తన కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్.మధు, టీడీపీ, వైసీపీ , బీజేపీ, జనసేన నాయకులు లాడి శ్రీనివాసరావు,హేమసుందరరాజు, మెట్ట తిరు మలరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళన చేయాలి

హిరమండలం:ఓటర్లజాబితా ప్రక్షాళనచేయాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు.గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు సర్వే కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ పాత హిరమండలంలోని 303, 304 పోలింగ్ కేంద్రాల్లో 260 మంది నాన్‌లోకల్ ఓటర్లు ఉన్నారని, వీరంతా నిర్వాసితులని, వీరి ఓట్లు తొలగించాలని కోరారు.

ఎరువుల కొరత తీర్చండి

సంతబొమ్మాళి: రైతులకు ఎరువుల కొరత తీర్చాలని జడ్పీటీసీ పాల వసంతరెడ్డి, సభ్యులు సూరాడ రాజారావు, సుధాకర్ కోరారు.గురువారం మండల సమావేశం ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు సకాలంలో అందేవని, ప్రస్తుతం ఎరు వులు పంపిణీ కాక రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. దీంతో ఏఈవో సురేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆక్రమణకు గురైన రోడ్లు గుర్తించి తొలగిస్తాం


కాశీబుగ్గ: మునిసిపాలిటీ పరిధిలోగల ఆక్రమణకు గురైన రోడ్లను గుర్తించి వాటిని తొలగింపునకు చర్యలు చేపడతామని చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు. గురువారం మునిసిపాలిటీ పరిధిలోని కొద్దేళ్లుగా ఆక్రమణకు గురైన ఆంధ్రా బ్యాంకు రోడ్డుకు సంబంధించి భూమిపూజచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దేళ్లుగా ఈ స్థలం ఆక్రమణకు గురైందని, ఇటీవల కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించి రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేంద్రకుమార్, కౌన్సిలర్ పి.ప్రసాద్ పాల్గొన్నారు.

జానపద కళారూపాలను సంరక్షించుకోవాలి



జానపద దినోత్సవంలో సిక్కోలు జానపద సాహిత్య, యువశక్తి యువజనసంఘ సభ్యులు

పలాస రూరల్: జానపద కళారూపాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని విజయనగరానికి చెందిన కళాకారుడు ఎ.ఉదయ్ భాస్కర్ తెలిపారు. గురువారం రాత్రి మాకన్నపల్లిలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో యువశక్తి యువజన సంఘం సౌజన్యంతో ప్రపంచ జానపద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపదులను పోషించి వాటికి తిరిగి పునఃవైభవం తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సిక్కోలు జానపద సాహితీ సభ్యులు జానపద కళలపై వివరించారు. నంతరం మాకన్నపల్లి కళాబృందాల ఆధ్వర్యంలో నృత్యాలు ఏకపాత్ర కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జానపదకళలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు కుమార్‌నాయక్, కుత్తుమ వినోద్, కిక్కర ఢిల్లీరావు, సిక్కోలు జానపదసాహితీ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.











జీఎస్టీ అధికారులమంటూ వ్యాపారికి బెదిరింపులు

- లంచంగా రూ.రెండు లక్షలు వసూలు
- ఫోన్‌లో మరో రూ.లక్షకు డిమాండ్
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు.. బయటపడిన వ్యవహారం

శ్రీకాకుళం క్రైం: నకిలీ జీఎస్టీ అధికారుల పేరుతో కొందరు ఓ వ్యాపారిని బెదిరించి రెండు లక్షల రూపాయలు లంచంగా వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని రాయివీధికి చెందిన రాయపురెడ్డి చంద్రశేఖర్ స్వీట్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చంద్రశేఖర్ స్వీట్స్ తయారు చేస్తుండగా తిత్తి ప్రవీణ్, పేడాడ మణికంఠ తాము జీఎస్టీ అధికారులమని.. స్వీట్ షాపు నడిపేందుకు ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ, లేబర్ లైసెన్స్ చూపించాలని బెదిరించారు. అలాగే రూ.15 లక్షలు లంచంగా డిమాండ్ చేశారు. అయితే తన వద్ద అంత సొమ్ము లేదని వ్యాపారి చెప్పడంతో కనీసం రూ.మూడు లక్షలైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో తన కుటుంబ అవసరాల కోసం ఉంచిన రెండు లక్షలు రవి అనే వ్యక్తి చేతుల మీదుగా ప్రవీణ్, మణికంఠలకు అందజేశారు. అంతటితో ఆగని ప్రవీణ్, మణికంఠ మిగిలిన రూ.లక్ష కోసం చంద్ర శేఖర్‌ను ఫోన్లో బెదిరించారు. దీంతో చంద్రశేఖర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. సీఐ ఉమామహేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి బస్సుకు త్రుటిలో తప్పిన ముప్పు


పోలాకి జంక్షన్ వద్ద డ్రైనేజ్‌లో కూరుకున్న పెళ్లి బస్సు

నరసన్నపేట: నరసన్నపేటలోని పోలాకి జంక్షన్ వద్ద గురువారం ఉదయం ఓ పెళ్లి బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. టెక్కలి వైపు నుంచి నరసన్నపేట వస్తున్న పెళ్లి బస్సు నరసన్నపేటలోని పోలాకి జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చే వాహనాలకు మార్గం ఇచ్చేందుకు బస్సు ఎడమ వైపునకు రావడంతో వెనుక చక్రాలు డ్రైనేజ్‌లో వెళ్లాయి. ఆ సమయంలో డ్రైవర్ అప్రమత్తమై ఒక్కసారిగా బస్సు నిలిపివేశారు. వెంటనే అందులో ఉన్న 30 మంది వరకూ ప్రయాణీలకు కిందకు దించి బస్సును ఇతర వాహనాలు సహాయంతో బయటకు తీశారు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు.

నిందితుడి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపిస్తున్న సీఐ

పోలాకి: మబగాం గ్రామానికి చెందిన తెలుగు రమణమూర్తి ఇంట్లో చోరీకి గురైన బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల రెండో తేదీన రమణమూర్తి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి సుమారు 12 తులాల బంగారం దొంగిలించారు. ఈ ఘటనపై అప్పట్లో పోలాకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు గురువారం సత్యవరం కూడలి సర్వీస్ రోడ్డులో తనిఖీలు చేస్తుండగా.. శ్రీకాకుళం మండలం కరిమెళ్లపేట కాలనీకి చెందిన నాగళ్ల నాగరాజును పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి వాహనం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రెండు తులాల బరువు గల రెండు బంగారం ముక్కలు, తులం బరువు గల పుస్తెలతాడు, రెండు తులాల బరువు గల పుస్తెలతాడు మొత్తం ఎనిమిది తులాల బరువు గల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగలించిన ఆభరణాలను, వాటి వివరాలను నరసన్నపేట సీఐ జే.శ్రీనివాసరావు, ఎస్‌ఐ సత్యనారాయణ గురువారం విలేకరులకు వివరించారు.

ఆర్ఆర్ కాలనీలో ఆక్రమణలు తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: గాజులకొల్లివలస సమీపంలో ఉన్న వంశధార రిజర్వాయర్ నిర్వాసితుల ఆర్ఆర్ కాలనీలో ఆక్రమణలను గురువారం అధికారులు తొలగించారు. వంశధార నిర్వాసితులైన తిరునాగూరు రవి, తిరునాగూరు ప్రమీలకు గతంలో ప్రభుత్వం గాజుల కొల్లివలస బ్లాక్-2లో ఒక్కొక్కరికి ఐదు సెంట్లు స్థలం మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ స్థలాన్ని అదే కాలనీలో నివాసం ఉంటున్న బండి విజయ, బండి సింహాచలం ఆక్రమించుకుని పశువుల రేకుల షెడ్లు వేసి వాడుకుంటున్నారన్నారు. దీనిపై లబ్ధిదారులు నిలదీసినా పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఎస్.రాంబాబు, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ వెంకటేష్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది గురువారం అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలు అధికారులు తొలగించి లబ్ధిదారులకు అప్పగించారు.

పిచ్చిమొక్కల నడుమ సర్వే రాళ్లు


ఆర్‌బీకే ఎదురుగా వృథాగా ఉన్న భూసర్వే రాళ్లు

గార: వైసీపీ ప్రభుత్వ హయాంలో వేలాది రూపాయలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన భూ సర్వే రాళ్లు కళింగపట్నంలో ఆర్‌బీకే ఎదురుగా పిచ్చి మొక్కల మధ్య వృథాగా పడి ఉన్నాయి. రెండేళ్లుగా ఇక్కడ ఈ సర్వేరాళ్లు పడి ఉండడంతో వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి కనిపిస్తున్నాయి. వేలాది రూపాయల ప్రజా ధనం వెచ్చి కొనుగోలు చేసిన ఈ భూ సర్వే రాళ్లు ఇలా వృథాగా ఉండడంపై స్థానికులు మండిపడుతున్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభించండి


అధికారులతో మాట్లాడుతున్న పాణిగ్రాహి

పర్లాకిమిడి: మున్సిపాల్టీ పరిధిలో గల ఆరో వార్డు శేరి మాదిగ వీధి సమీపంలో ఉన్న డ్రైనేజీ పనులు వెంటనే ప్రారంభించాలని చైర్‌పర్సన్ నిర్మలా శెట్టి, అధికారులను బీజేడీ నాయకుడు తిరుపతి పాణిగ్రాహి కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బీజేడీ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు



పర్లాకిమిడి: పట్టణ పరిధి జయమహల్ కూడలి వద్ద సినీహీరో, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. గురువారం భారీ కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. జగన్నాథ కీతేన్ ఆశ్రమంలో మిఠాయిలు పంపిణీ చేశారు. అలజింగి రాము, ధర్మ, కృష్ణ, శ్యామ్, శంకర్, చందన్, జీవా పాల్గొన్నారు.

సమస్యల సుడిలో సెగిడిపేట

- కాలువలు లేక రోడ్డుపై మురుగు
- కానరాని కనీస వసతులు
- పట్టించుకోని పాలకులు


వీధిలో నిలిచిన మురుగు నీరు

పాడుబడిన భవనంలో అంగన్‌వాడీ కేంద్రం


కనీస వసతులకు నోచుకోని సెగిడిపేట గ్రామం

(లావేరు)

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో.. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ గ్రామం మారుమూల ప్రాంతం కంటే దీనంగా ఉంది. కనీస వసతులు కూడా లేకపోవడంతో ఆ గ్రామస్థులు దుర్భర జీవనం సాగిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుడుమూరు పంచాయతీ పరిధిలోని ఓ కుగ్రామం సెగిడిపేట. ఈ గ్రామం దశాబ్దాలుగా సమస్యలతో కొట్టిమిట్టాడుతోంది. దాదాపు 55 కుటుంబాలు ఉండగా.. సుమారు 250 వరకు జనాభా నివసిస్తున్నారు. అయితే గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ గ్రామంలో కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. వీధి రోడ్లు మురుగు కాలువలను తలపిస్తున్నాయి. గ్రామంలో బడిఈడు పిల్లలు 20 మంది వరకు ఉన్నా ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో సుమారు రెండు కిలో మీటర్లు దూరంలో ఉన్న బొంతువలస పాఠశాలకు కొంతమంది విద్యార్థులు వెళ్తుండగా, మరికొందరు బుడుమూరు, చిలకపాలెం తదితర గ్రామాలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఈ గ్రామంలో రేషన్ షాపు లేదు.. స్వచ్ఛమైన తాగునీరు కూడా అందక అవస్థలు పడుతున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రం ఉన్నా శాశ్వత భవనం లేక పాడుబడిన ఓ పెంకుటింట్లోనే కొనసాగిస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఆ గ్రామస్థులు కనీసం వసతులైనా కల్పిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సీ ప్లాన్ విధానంతో రవాణా మరింత సులభతరం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్

అరసవల్లి: నూతన సీ ప్లాన్ విధానంతో ప్రజా రవాణా మరింత సులభతరం కానుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు సంబంధించిన మార్గదర్శకాలను ఆయన గురువారం ఢిల్లీలోని ఏవియేషన్ అకాడమీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విశాఖ, కాకినాడ, నర్సాపురం తదితర సువిశాల తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు శ్రీశైలం, ప్రకాశం బ్యారేజి, రాజమండ్రి వంటి నదీ పరివాహక ప్రాంతాల్లో సీప్లాన్ విధానాన్ని అమలుపై దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు పర్యాటకాభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, విమానయాన నిపుణులు, పర్యావరణ అధికారులతో సహా వివిధ వర్గాలతో సంప్రదించి, పర్యావరణ అనుకూలంగా మార్గదర్శకాలు రూపొందించామని వివరించారు.

రక్త పరీక్షలు విధిగా చేపట్టాలి


చిన్నారితో మాట్లాడుతున్న మలేరియా అధికారి

రణస్థలం: జ్వరంతో బాధపడుతున్న వారికి విధిగా రక్త పరీక్షలు చేపట్టాలని విశాఖ జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ అన్నారు. గురువారం పాతర్లపల్లి, రావాడ పీహెచ్‌సీలను ఆమె సందర్శించి, లాబ్‌లను పరిశీలించారు. ఇటీవల పాతరపల్లి, రావాడా పీహెచ్‌సీ పరిధిలో డెంగ్యూ బారిన పడిన వారిని పరామర్శించారు. సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆమదాలవలస: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలసకు నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను రాగోలు వద్ద గురువారం ఆయన పరిశీలించారు. ఎన్నికల్లో ఇచ్చినహామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లో నిర్మాణ పనులు చేపడుతుండడం ఆనందంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వల్లనే అనేక మంది తమ ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను పూర్తి చేసి రోడ్డును అందిస్తామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరిశోధనా ప్రవేశాలపై సమీక్ష

ఎచ్చెర్ల: రాష్ట్రంలోని 17 వర్సిటీల్లో నిర్వహించనున్న ఫుల్‌టైం, పార్ట్‌టైమ్ పరిశోధనా సీట్ల ప్రవేశాలపై గురువారం సాయంత్రం వెంకటేశ్వర వర్సిటీ (తిరుపతి) ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించింది. వర్చువల్‌లో జరిగిన ఈ సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ కేఆర్ రజని పాల్గొని మాట్లాడారు. పరిశోధనా ప్రవేశాల కోసం వెంకటేశ్వర వర్సిటీ ఈ ఏడాది మే 2 నుంచి 4వ తేదీ వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించి.. అదే నెల 20న జాబితాను ప్రకటించి, 24 నుంచి 27వ తేదీ వరకు సర్టిఫికేట్ల పరిశీలన, ఇంటర్వ్యూలను నిర్వహించిందన్నారు. బీఆర్ఏయూ వీసీ రజని మాట్లాడుతూ.. వర్సిటీతో పాటు శ్రీకాకుళం నగరంలోని మరో రెండు ప్రభుత్వ అనుబంధ కళాశాలల్లో పరిశోధన ప్రవేశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. బీఆర్ఏయూలో బయోటెక్నాలజీలో ఏడు ఫుల్‌టైం, ఒక పార్ట్‌టైమ్, అర్థిక శాస్త్రంలో ఫుల్‌టైం, పార్ట్‌టైమ్ సీట్లు చెరొకటి ఉన్నాయన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం)లో ఇంగ్లీష్‌లో రెండు, బయోటెక్నాలజీలో నాలుగు, కెమిస్ట్రీలో నాలుగు పార్ట్‌టైమ్ సీట్లు భర్తీకానున్నాయని చెప్పారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (శ్రీకాకుళం)లో ఇంగ్లీష్, ఫిజిక్స్‌లో ఫుల్‌టైం, పార్ట్‌టైమ్ చెరొకటి, తెలుగు, కెమిస్ట్రీలో ఫుల్‌టైం, పార్ట్‌టైమ్ చెరో రెండు ఉన్నాయని చెప్పారు. ఈ ప్రవేశాలు ఆర్-సెట్ మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో చేపడతామన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి ప్రధాన సమస్యలు


ఎమ్మెల్యేను అభినందిస్తున్న న్యాయవాదులు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయని ఇచ్ఛాపురం న్యాయవాదులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే బెందాళం అశోక్ నివాసంలో కలిసి సాలువలతో సత్కరించి పూలగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందికి రమణయ్య రెడ్డి, న్యాయవాదులు రంగారావు, దేవరాజురెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఎస్ఎల్ నారాయణ, ఎనసీ సాహు, అల్లాడ నారాయణ, సీతయ్యరెడ్డి, రాంబాబు, బైరాగిరెడ్డి, ప్రహల్లాద్, కామేష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి


యువతతో మాట్లాడుతున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం: ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ వాడాలని సీఐ మీసాల చిన్నమనాయుడు అన్నారు. గురువారం పురుషోత్తపురం జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు హెల్మెట్లు, మైనర్ డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధిస్తామన్నారు. మైనర్లు బైక్‌లు నడిపి పట్టుబడితే వాహనదారుడుతోపాటు వాహన యజమానిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని సూచించారు. అలాగే టీడీపీ నాయకులు సీఐను కలిసి ఘనంగా సత్కరించారు.

ప్రమాదకరంగా..


రోడ్డుకి ఇరువైపులా ఏపుగా పెరిగిన జంగిల్

ఎచ్చెర్ల: శ్రీకాకుళం నగర పరిధి ప్రేమ సమాజం జంక్షన్ నుంచి తోటపాలెం మీదుగా వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో ఎక్కడికక్కడ మలుపు ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. రహదారికి ఇరువైపులా ఏపుగా పిచ్చిమొక్కలు పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించడంలో ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఒక్కోసారి ప్రమాదానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ర్యాలీ


ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలపై ర్యాలీ

గార: ఆంధ్రపదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం గారలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు నక్క రామకృష్ణ, వినోదినితో పాటు ఇతర సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ రెండు కోర్సులపై ప్రవేశాలకు అవగాహన కల్పించారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం

బూర్జ: పరిశుభ్రతతో అంటురోగాల వ్యాప్తిని నివారించవచ్చునని వైద్యాధికారి పావని అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం బూర్జలో గురువారం నిర్వహించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల వృద్ధి చెందకుండా మురుగునీరు నిలువ లేకుండా చూడాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదన్నారు. వేడినీరు తాగాలన్నారు.

వేడుకగా చిరు జన్మదినం


మొక్క నాటుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్

ఇచ్ఛాపురం: కేంద్ర మాజీ మంత్రి సినీహీరో మెగస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు చిరు ఫ్యాన్స్ అధ్యక్షుడు అలీంఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌కట్ చేసి సందడి చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్, స్వీట్స్ ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి చేతులు మీదుగా అందజేశారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు సూపరెండెంట్ చేతుల మీదుగా నాటించారు కార్యక్రమంలో చిరుఫ్యాన్స్ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అలీంఖాన్, ఫ్యాన్స్ దట్టి శ్రీను, అజయ్, అజ్జు, తిప్పన జనార్ధన, శ్రీకాంత్, క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ పాల్గొన్నారు.

సేవలకు కేరాఫ్ చిరంజీవి అభిమానులు


సిద్ధయ్యను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఏడురోడ్ల కూడలిలో గురువారం మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా జిల్లా సీనియర్ మెగా అభిమాన సంఘం అధ్యక్షుడు ఎస్.సిద్ధయ్య ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకులు షైలపిల్లి నర్సింహమూర్తి తదతరులు పాల్గొన్న కేక్ కట్‌చేశారు. 100 మంది నిరుపేదలకు నర్సింహమూర్తి, గౌరవ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ నూతన దుస్తులు, నిత్యావసర సరుకులతో పాటు బిర్యాణి ప్యాకెట్లు అందించారు. సంఘ ప్రతినిధులు కె.మురళి, లక్ష్మణ,జి.కొర్లయ్య, సత్యం,వినోద్, కన్నారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు బాసటగా నిలవాలి

ఆమదాలవలస: సమాజంలో ఎంతో గౌరవ ప్రథమంగా నడుచుకోవడమే కాకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ నేటి యువతలు భావితరాలకు బాసటగా నిలవాలని ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువతీ యువకులు డ్రగ్స్, గంజాయిలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌సుందర్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పాతపట్నం: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హత్యాచారానికి నిరసనగా గురువారం పాతపట్నంలోని సెయింట్ ఆన్స్‌స్కూల్ కూడలిలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ప్రదీప్ తదితరులు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

పిల్ల కాలువ గండి పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జలుమూరు: మండలంలోని కరవంజ సమీపంలో 22 ఆర్ పిల్ల కాలువకు నాలుగో డ్రాపు వద్ద పడిన గండిని వంశధార అధికారులు గురువారం పూడ్చి వేశారు. 22-ఆర్ పిల్ల కాలువ గండి శీర్షికతో బుధవారం కథనం ప్రచురితమ య్యింది. దీంతో వంశధార అధికారులు స్పందించి గండిని ఇసుక బస్తాలతో పూడ్చించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

జలుమూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు కోరారు. గురువారం చల్లవానిపేట, లింగాలవలస హౌసింగుకాలనీల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో శేఖర్, ఈసి సోమేశ్వరరావు, క్షేత్రసహాయకులు దుంగ రాంబాబు పాల్గొన్నారు.

తమ్మినేనిపై ఎమ్మెల్యే రవికుమార్ ఫిర్యాదు


నీరబ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న రవికుమార్

ఆమదాలవలస: మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో నీరబ్ కుమార్‌ను కలిసి సీతారాం నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు చేయించాలని కోరారు. తమ్మినేని సీతారాంపై తాను 2022 సంవత్సరం నుంచి పోరాటం చేస్తున్నానన్నారు. అప్పట్లో స్పీకర్‌గా వ్యవహరిస్తున్న తమ్మినేని సీతారాం నకిలీ సర్టిఫికెట్ల పైన సుప్రీంకోర్టు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లకు, రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం సీఐడీ విచారణ జరిపించి నిజాలను నిగ్గుతేల్చాలని రవికుమార్ కోరారు. ఆయన వెంట తూర్పుకాపు సాధికార కమిటీ కన్వీనర్ పల్లి సురేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎచ్చెర్ల: ధర్మవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డి.మత్స్యలేశం, ఓపెఅగ్రహారం, భగీరథపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

- **గార:** వమరవెల్లిలో శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.
- **పొందూరు:** దళ్లవలస ఫీడర్‌లైన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్‌లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించడం, మరమ్మతులు చేపట్టనుండడంతో ధర్మపురం, దళ్లవలస, పిల్లలవలస, పెనుబర్తి, అచ్చిపోలవలస గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి రెండు గంటల వరకు విద్యుత్ నిలిపివేయన్నుట్టు తెలిపారు.
- **ఇచ్ఛాపురం:** స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మండలంలో గల బిర్లంగి, తోటూరు, సయ్యదాలపుట్టుగ, బొడ్డబడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయన్నుట్టు ఏఈ తెలిపారు.

28న జడ్పీ సర్వసభ్య సమావేశం

కలెక్టరేట్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్టు సీఈవో డి.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి సమావేశాలు ప్రారంభమవుతాయని, పూర్తి సమాచారంతో సంబంధిత అధికారులు రావాలని, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా బాలాజీ

ఆమదాలవలస: మున్సిపల్ కమిషనర్‌గా పూజారి బాలాజీ ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. గురువారం రాష్ట్ర ప్రభుత్వం చేసిన బదిలీల్లో భాగంగా బాలజీ ప్రసాద్‌ను ఇక్కడ నియమించారు. ఈయన ఇంతవరకు విజయనగరం జిల్లా నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమదాలవలస మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

అలంకరణలో విజయ గణపతి



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులో ఉన్న శ్రీ విజయ గణపతి సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెంటా శ్రీధర్ శర్మ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

కంచిలి: బూరగాం, కత్తివరం గ్రామాల్లో పశువైద్యాధికారిణి టి.శిరీష ఆధ్వర్యంలో పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశారు. వచ్చే నెల 18వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఈ టీకాలు వేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పాడి రైతులు, పశుసంవర్ధక శాఖాధికారులు పాల్గొన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు శరీర ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయని, నోటి నుంచి చొంగలు కారుతాయని, ఆహారం తినేందుకు ఇష్టపడవన్నారు. పశువైద్యులను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ సేవలు అందాలి

పాతపట్నం: ప్రతి గ్రామానికి ప్రభుత్వ సేవలందాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి సన్యాసినాయుడు తెలిపారు. గురువారం మండలంలోని కోఐంగి, గిట్టంగిలో న్యాయవిజ్ఞానసదస్సును నిర్వహించారు. మహిళా భద్రతా చట్టా లపై అవగాహన కలిగించారు. ఎంపీడీవో ప్రసాద్, డీటీ పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

కవిటి: వరక పంచాయతీ సన్యాసిపుట్టుగ గ్రామంలో గురువారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. గ్రామానికి సమీపంలోని మూడు రోడ్ల కూడలిలో స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.